క్లుప్తంగా

వీఆర్వోకు షోకాజ్ నోటీస్

కారెంపూడి: కారెంపూడి మండలం ఒప్పిచర్ల వీఆర్వో బి.కోటేశ్వరరావుకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు పల్నాడు జిల్లా జేసీ శ్యాం ప్రసాద్ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఆయన తన వాట్సాప్‌లో స్టేటస్‌గా ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన ఫొటో పోస్ట్ చేయడంతో అందిన ఫిర్యాదు మేరకు వీఆర్వోకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఎన్నికల నియమావళిని ప్రజల్లోకి అధికారులు తీసుకెళ్లడంతో పాటు నియమ నిబంధనల అమలుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఎన్నికల నియమాలను తప్పక పాటించాలని జేసీ శ్యాంప్రసాద్ కోరారు.

గొట్టిపాళ్ళలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి

వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ళలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి దాడి చేసి గాయపరిచారు. గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు పాత కక్షల నేపథ్యంలో ఒంటరిగా వెళ్తున్నప్పుడు కాపు కాసి టీడీపీకి చెందిన మరియదాసు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రయ్యపై రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

అదృశ్యం పై కేసు నమోదు

మాచర్ల: స్థానిక పీడబ్ల్యూడీ కాలనీ వాసి గనిపల్లి మరియదాసు మార్చి 1న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఆయన కుమారుడు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో లస్కర్ ఉద్యోగం చేస్తున్న గనిపల్లి మరియదాసు అదృశ్యం పై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు అర్బన్ సీఐ పి. శరత్‌బాబు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కనుమలచెరువులో ఫ్యామిలీ డాక్టర్

బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టరు ఫిజీషియన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యులు వి.సాయితేజ, ఆధ్వర్యంలో వైద్య చికిత్సలు అందజేశారు. గ్రామంలో సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని వైద్యులు తెలిపారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి రక్త పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులకు మందులు పంపిణీ చేశామన్నారు. ఫ్యామిలీ వైద్యుడు ఫిజీషియన్ కార్యక్రమంలో ప్రత్యేకంగా రోగులకు ఇంటికే మందులు సరఫరా ఉంటుందని చెప్పారు. పీహెచ్‌సీలో కావల్సిన మందులు అందుబాటులోని పక్షంలో రోగులు తమకు అవసరమైన మందులను ముందుగా ఎంఎల్‌హెచ్‌పీ, కానీ పీహెచ్‌సీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆయా మందులను రోగులకు నేరుగా ఇంటికే సరఫరా చేస్తామని, ఈ గ్రామంలో 20 మంది దీర్ఘకాలిక వ్యాధులకు మందులకు పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీకేర్‌లో అరుదైన శస్త్ర చికిత్స



నరసరావుపేట: పట్టణంలోని వినుకొండరోడ్డులో గల శ్రీ కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స చేసి ఓ రోగి శరీరం నుంచి 10 కేజీల గడ్డను తొలగించినట్లు హాస్పిటల్ ఎం.డి డాక్టర్ గడ్డం శ్రీకాంత్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి విపరీతమైన కడుపు నొప్పితో తమ వైద్యశాలలో చేరారని, స్కానింగ్ చేసి చూడగా అతని పొట్టలో గడ్డ ఉన్నట్లుగా గుర్తించామన్నారు. శస్త్రచికిత్స చేసి తొలగించాల్సిన పరిస్థితులను రోగికి వివరించి ఆపరేషన్ చేసి గడ్డను తీసివేయటం జరిగిందన్నారు. దీంతో ఆ రోగి ఉపశమనం పొందారన్నారు. రోగి కుటుంబ సభ్యులు డాక్టర్ శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల సిబ్బందికి బీమా సౌకర్యం కల్పించాలి

అమరావతి: ఎన్నికల విధుల్లోని సిబ్బందికి కోటి రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని ఎస్టీయూ డి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక జేబీ స్కూల్‌లో జరిగిన ఎస్టీయూ డి మండల శాఖ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. కుంభా సాంబశివరావు అధ్యక్షత వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ జెడ్పీపీఎఫ్ షెడ్యూల్స్‌ను సకాలంలో అందించాలని, ఏపీజీఎల్ఐ బాండ్సును అందరికీ అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శి సాంబశివరావు ప్రసంగించారు. మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. గౌరవాధ్యక్షుడిగా దాసరి కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా ఎ.ఆనందరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్కే జావేద్, కార్యదర్శి కుంభా సాంబశివరావు, ఆర్థిక కార్యదర్శి కె.అంకాలు, సహాయ కార్యదర్శి షేక్. ఖైరున్నిసా, మహిళా కార్యదర్శి అ.వేణుకుమారి ఎన్నికయ్యారు. ఈ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పులిపాడులో అభివృద్ధి పరుగులు

- కనుమరుగైన ఫ్యాక్షన్
- మారిన పులిపాడు రూపురేఖలు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- మెరుస్తున్న సీసీ రోడ్లు



గురజాల : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో మండలంలోని పులిపాడు గ్రామం ప్రగతి పథంలో పయనిస్తుంది. ఒకప్పుడు ఫ్యాక్షన్ గొడవలతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పులిపాడు గ్రామం నేడు ఎంతో అభివృద్ధి చెందింది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు ఉపాధి పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. అభివృద్ధి అంటే ఏంటో తెలియని ఈ గ్రామం నేడు అత్యున్నత స్థాయిలో అభివృద్ధి బాట పట్టడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది. గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలతో పాటు పాఠశాలలు, వైద్యశాలలు, రోడ్డు, రహదారులు, వంటి ఎన్నో రకాల సౌకర్యాలు జగనన్న హయాంలో చేకూరాయి. గ్రామంలో ఎటు చూసినా సిమెంటు రోడ్లు, డ్రైయిన్లు దర్శనమిస్తున్నాయి. సచివాలయం ద్వారా ప్రజలకు సేవలు అందుతున్నాయి. గత ఐదేళ్లలో ఫ్యాక్షన్ అంటే ఏంటో మరచిపోయారు. టీడీపీ హయాంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో గొడవలు, కొట్లాటలు జరుగుతుండేవి. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అనేక అభివృద్ధి పనులతో గ్రామ స్వరూపం మారిపోయింది. మొత్తం గ్రామ రూపం అతి తక్కువ కాలంలో మారిపోవడంతో వివిధ వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో అభివృద్ధి పనులు ఇలా...

- రూ.90.63 లక్షలతో నాడు–నేడు ద్వారా 5 పాఠశాలల అభివృద్ధి
- రూ.80 లక్షలతో 2 సచివాలయ భవనాల నిర్మాణం
- రూ.43.60 లక్షలతో 2 రైతు భరోసా కేంద్రాలు
- రూ.41.60 లక్షలతో 2 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం
- రూ.19 లక్షలు 2 భవనాలు
- రూ.1.49 కోట్లతో 21 సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.30 లక్షలు 15 గ్రావెల్ రహదారుల కింద
- జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటుకు రూ.1.90 లక్షలు నిధులు సమకూర్చారు.
- మొత్తం 68 పనులకు గాను రూ.7.74 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయడం జరిగింది.



రైతు భరోసా కేంద్రం



గ్రామంలో వేసిన సీసీ రోడ్డు



పులిపాడు గ్రామ సచివాలయం

సంక్షేమంలో కొన్ని ఇలా...

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూపాయలలో)
అమ్మ ఒడి	778	3,52,82,484
జగనన్న విద్యా దీవెన	503	2,23,95,357
జగనన్న వసతి దీవెన	369	66,44,802
రైతు భరోసా	1589	6,98,98,650
వైఎస్సార్ చేయూత	296	1,21,12,500
ఆసరా	818	2,65,10,496

అలాగే 563 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు.

అభివృద్ధే లక్ష్యంగా...



గ్రామంలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం జరిగింది. ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ప్రజలకు చేరువయ్యాయి. అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందాయి. గతంతో పోల్చితే ఈ ప్రభుత్వంలో ప్రజలు అందరూ ఆనందంగా ఉన్నారు. పులిపాడు గ్రామంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయి. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాల మేరకు కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు చేపట్టాం.

– ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ

జగన్‌కు ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలి...



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలి. పల్నాడును అభివృద్ధి పథంలో నడిపించాలనే ఏకైక లక్ష్యంతోనే వేల కోట్ల రూపాయలు నిధులు అందించి వెనుకబడిన పల్నాడు ప్రాంతం అభివృద్ధికి దోహదపడ్డారు. ప్రజలకు అవసరమైన ప్రతి అవసరాన్ని గుర్తించి ప్రజలకు అందించాం. ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపాం. గత ప్రభుత్వం హయాంలో సమస్యలతో కొట్టుమిట్టాడే ప్రాంతాలు కూడా ప్రస్తుతం ప్రగతి పథంలో ముందుకు వెళ్లాయి.

– ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో 35 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : టీడీపీకి గట్టి షాక్ తగిలింది, టీడీపీ నాయకుల వైఖరితో విసిగిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. నగర పంచాయతీ పరిధిలోని 12వ వార్డులో టీడీపీకి చెందిన 35 కుటుంబాల వారు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నేతలు తమ్మిశెట్టి రామకృష్ణా, బత్తుల నాగేశ్వరరావు, చల్లా లింగయ్య ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన వేముల బాలయేసు, తిరుమలకొండ సురేష్, తమ్మిశెట్టి నీలేంద్రరావు, కుంచాల సురేష్, కుంచాల వెంకటేశ్, గుంజా సాయి, గుంజా శ్యామ్, ఓర్సు మధు, మంజుల చిట్టి, మంజుల అనిల్, బండారు అనిల్, బండారు చిరంజీవి, వేముల అనిల్, ఉప్పుతల జోష్‌బాబు, వల్లెపు చిన్నప్పరాజు, ఎం. శ్రీను, చల్లా నారాయణ, తిరుమలకొండ బాబు, ఆర్. పెద్దిరాజు తదితరులకు ఎమ్మెల్యే కాసు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జగనన్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కాసు వడియరాజులకు క్వారీలు ఇవ్వటం తమకు సంతోషంగా ఉందని, ఏళ్ల తరబడి టీడీపీలో ఉన్నా మాకు ఎటువంటి న్యాయం జరగలేదని వారు చెప్పారు. వడియరాజులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కాసు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, వార్డు కౌన్సిలరు దేవళ్ల లక్ష్మీప్రసన్న, నాయకులు దేవళ్ల రఘు, బత్తుల బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

సీఐ సురేంద్రబాబు



ముత్యాలంపాడులో కవాత్ నిర్వహిస్తున్న పోలీసులు

దాచేపల్లి : సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని సీఐ ఎ.సురేంద్రబాబు అన్నారు. మండలంలోని ముత్యాలంపాడు, తంగెడ గ్రామాల్లో సోమవారం పోలీస్ బలగాలతో కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పిస్తున్నామని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేయవద్దని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా డబ్బులు, వస్తువులు పంపిణీ చేయటం ఎన్నికల నియమ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులకు సహకరించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ పర్యటన

వినుకొండ (నూజండ్ల): వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డా. అనిల్ కుమార్ యాదవ్, బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి పాల్గొంటున్నట్లు కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు వినుకొండ రూరల్ కోటప్ప నగర్ గ్రామం మీదుగా పెదకంచెర్ల, ఏనుగుపాలెం, పిట్టంబండ, ఉమ్మడివరం, నాగులవరం, గోకనకొండకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

గేట్ ఫలితాల్లో లైమ్ సీటీ విద్యార్థి ప్రతిభ



పిడుగురాళ్ల: జాతీయ స్థాయిలో లైమ్‌సిటీ విద్యార్థి ప్రతిభ సాధించాడు. జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్ పరీక్ష ఫలితాల్లో పిడుగురాళ్ల(లైమ్‌సిటీ) పట్టణానికి చెందిన వేములూరి కార్తికేయ 27వ ర్యాంక్ సాధించి ప్రతిభను కనబరిచారు. గత ఏడాది చివర్లో గేట్ 2024 పరీక్షలు రాశాడు. డేటా సైన్సు విభాగంలో జాతీయ స్థాయిలో గేట్‌లో ఈ ర్యాంక్ సాధించాడు. గతంలో జేఈఈలోను ప్రతిభ కనబరిచి సూరత్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. ఇప్పుడు గేట్‌లో మంచి ర్యాంక్ సాధించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

కంటి చూపును పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

చిలకలూరిపేట: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని కంటి చూపును పరిరక్షించుకోవాలని ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ చిలుకూరి శ్రీరామమూర్తి చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం ఎన్నో ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చిన కారణంగా ఆపరేషన్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 364 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 63 మందిని ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. గతంలో ఆపరేషన్లు చేయించుకున్న 250 మందికి కళ్లజోళ్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చింతన్, డాక్టర్ కమల, క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమన రెడ్డి, సభ్యులు తోటకూర వెంకట నారాయణ, కారుమంచి శివరావు, గళ్లా సాంబశివరావు, గోగినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోగికి వైద్యుడే దేవుడు..



డాక్టర్ రవివర్మను సత్కరిస్తున్న వైద్యులు

పెదకూరపాడు: ప్రేమతో ఆదరించి, మెరుగైన వైద్యం అందిస్తే.. వైద్యులను రోగులు గుండెల్లో పెట్టుకుని చూస్తారని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ గుంటూరు రవివర్మ అన్నారు. రవివర్మ పదోన్నతిపై చిలకలూరిపేట ఏరియా వైద్య శాలకు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయి శ్రీనివాసరావు బదిలీపై వెళ్లారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో వారికి సన్మానం నిర్వహించారు. డాక్టర్ రవివర్మ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు పేదలకు వైద్య సేవలు అందించడం పూర్వజన్మలో చేసుకున్న పుణ్యమన్నారు. రోగిని ప్రేమతో ఆదరించి వారికి సేవలు అందించాలన్నారు. పెదకూరపాడు సీహెచ్‌సీ అభివృద్ధికి తోటి సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. ఇన్‌చార్జి సూపరడెంట్ డాక్టర్ విద్యా మాట్లాడుతూ వైద్యునిగా, సూపరింటెండెంట్‌గా సీహెచ్‌సీ అభివృద్ధికి డాక్టర్ రవివర్మ ఎంతో కృషి చేశారన్నారు. రోగులకు, వైద్యుల సంధానకర్తగా వ్యవహరించిన తీరుతో వైద్యశాల అభివృద్ధిలో నడుస్తోందన్నారు. ఆయన హయాంలో రూ.8.30 కోట్లతో నూతన వైద్యశాల నిర్మించినట్లు తెలిపారు. ఆయన బాటలో నడిచి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి శ్రీనివాసరావు, డాక్టర్లు చైతన్య, సూనియా, రమేష్, ఆశీర్వాదం, భాగ్యశ్రీ, జాన్‌కోసీ, రూప, వైద్య సిబ్బంది దుర్గాభవాని, ఫార్మసిస్ట్ లక్ష్మి, ఎల్టీ శ్రీలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కో–ఆప్షన్ మెంబరు షేక్ మౌలాలి అన్నారు. నరసరావుపేటకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ అబ్దుల్ మస్తాన్ ఆటోనగర్‌లో సోమవారం స్థానిక ముస్లింలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి అంబటి రాంబాబును అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఐదవ వార్డు కౌన్సిలర్ సయ్యద్ సలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూరు మేస్త్రి షేక్.జానీ, పెద్దింటి నాగేశ్వరరావు, హుస్సేన్ మేస్త్రి, బేతపూడి నన్నే, ఇస్మాయిల్, పఠాన్ హజీబుడా, ఆటోనగర్ యూనియన్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి తదితరులు ఉన్నారు.

ఒంటిపూట బడులు ప్రారంభం

సత్తెనపల్లి: వేసవి తీవ్రత దృష్ట్యా పాఠశాలలకు ఒంటిపూట బడులు సోమవారం నుంచి నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 7:45 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే పాఠశాల తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

పలు గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

ముప్పాళ్ల: రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో అదనపు బలగాలు సోమవారం కవాతు నిర్వహించాయి. ఇరుకుపాలెం, మాదల, పలుదేవర్లపాడు, నర్నేపాడు గ్రామాల్లో కేంద్ర అదనపు బలగాలు 45 మంది సిబ్బందితో రూరల్ సీఐ పి.రాంబాబు , ముప్పాళ్ల ఎస్ఐ హజరతయ్య ఆధ్వర్యంలో ముప్పాళ్ల పోలీసు సిబ్బందితో పాటుగా సీఐఎస్ఎఫ్ 981వ బెటాలిన్ సిబ్బంది పాల్గొన్నారు.

19 మంది విద్యార్థులు గైర్హాజరు



వెల్దుర్తి మండలంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



విజయపురిసౌత్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

మాచవరం: మండలంలో మొదటి రోజు నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ బి.రాజకుమారి తెలిపారు. మండలంలోని పిన్నెల్లి, మాచవరం, వేమవరం, మోర్జంపాడు, పిల్లుట్ల జీవీజీకేఆర్ఓ, పిల్లుట్ల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, మాచవరం జీకే పబ్లిక్ స్కూల్‌లలో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులు మొత్తం 544 మంది హాజరు కావాల్సిన ఉండగా, వారిలో 525 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారు. మాచవరం జడ్పీ హైస్కూల్ సెంటర్‌లో ఐదుగురు, జీకే పబ్లిక్ స్కూల్ సెంటర్‌లో 14 మంది మొత్తం 19 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కాలేదని తెలియజేశారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు తెలిపారు.

11 పరీక్షా కేంద్రాల్లో ..

పిడుగురాళ్ల: పదవ తరగతి విద్యార్థులకు సోమవారం పబ్లిక్ పరీక్షలు మొదలైనట్లు పిడుగురాళ్ల ఎంఈవో అట్లూరి శ్రీనివాస రెడ్డి తెలిపారు. పిడుగురాళ్ల పట్టణం, మండలంలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరిక్షలు జరిగాయి. పట్టణంలో మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రెండు సెంటర్లు, లెనిన్‌నగర్ హైస్కూల్లో, స్కాలర్స్ హైస్కూల్లో, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో, శ్రీ చైతన్య స్కూల్లో, నారాయణ హైస్కూల్లో, కామినేని హైస్కూల్లో, మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో, జానపాడు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల్లో పరీక్షా కేంద్రాల్లో పరిక్షలు ప్రశాంతంగా జరిగాయి.

దాచేపల్లిలో 812 మంది హాజరు

దాచేపల్లి : పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. దాచేపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు సెంటర్లు, స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఒకటి, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఒకటి చొప్పున పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాలుగు సెంటర్లలో 812 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. నిర్ణీత సమయానికే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఎంఈవో పినాకపాణి, ప్లెయింగ్ స్కాడ్ అధికారులు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేశారు.

వెల్దుర్తిలో...

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు, వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి తెలుగు పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని శిరిగిరిపాడు ఐటీడీఏ పాఠశాల, వెల్దుర్తిలోని కస్తూరి బా గాంధీ పాఠశాల, కండ్లకుంటలోని ఏపీ మోడల్ స్కూల్, మండాది, వెల్దుర్తి, శిరిగిరిపాడు, గుండ్లపాడు, కండ్లకుంట జెడ్పీహెచ్ఎస్ లలో చదువుతున్న 424 విద్యార్థులకు గాను 409 విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 15 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ కె కాంతారావు తెలిపారు. శిరిగిరిపాడు జెడ్పీహెచ్ఎస్‌లో 11 మంది, వెల్దుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో నలుగురు గైర్హాజరయ్యారు.

రెంటచింతలలో...

రెంటచింతల: 10వ తరగతి పరీక్షలలో భాగంగా సోమవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు 739 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో–2 వై. శివనాగేశ్వరరావు అన్నారు. సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల, వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఫాతిమా విద్యానికేతన్ పాఠశాలలో మొత్తం 740 మంది విద్యార్థులకు గాను పరీక్షలకు 739 మంది విద్యార్థులు హాజరు కావడం జరిగిందన్నారు.

మాచర్లలో

మాచర్ల: పట్టణంలో 6 పాఠశాలల్లో, రూరల్ మండలంలో 2 పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. పట్టణంలో కిడ్స్ లో రెండు సెంటర్లు, జెడ్పీహెచ్ఎస్ బాలిక, బాలురోన్నత పాఠశాల, సెయింటాన్స్ తెలుగు, ఇంగ్లీషు మీడియం పాఠశాలలతో పాటు, మండలంలోని విజయపురిసౌత్‌లోని 2 పరీక్ష కేంద్రాలలో 1400ల మంది విద్యార్థులు పైగా పరీక్షలు రాశారు. ఒకరిద్దరు మినహా విద్యార్థులంతా పరీక్షలకు హాజరయ్యారు.

విజయపురిసౌత్‌లో....

విజయపురిసౌత్: పదో తరగతి పరీక్షలు విజయపురిసౌత్‌లోని రెండు పరీక్షా కేంద్రాలలో సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 145 మంది విద్యార్థులకు గాను 140 మంది విద్యార్థులు హాజరవ్వగా, పీటీజీ పాఠశాలలో 140 మంది విద్యార్థులకు గాను 135 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌గా శ్రీధర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా సంపత్, పీటీజీ పాఠశాలలో చీఫ్ సూపర్నెంట్‌గా బాబులానాయక్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా కేశవరావు వ్యవహరించారు. విజయపురిసౌత్ ఎస్ఐ వెంకటకొండారెడ్డి పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

వినుకొండ టౌన్: విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించి, నిర్వహణ తీరుతెన్నులను గ్రంథాలయ అధికారి బద్రీనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నించే వారికి, సమాజంపై అవగాహన పెంపొందించుకునే వారికి గ్రంథాలయాలు ఎంతో తోడ్పడతాయన్నారు. అటువంటి గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

కస్తూర్బా పాఠశాలకు పుస్తకాల విరాళం



నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో శ్రీనాథ సాహితీ పరిషత్ సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి జహీరాబాద్‌కు చెందిన డాక్టర్ శివబాబు పుస్తకాలను విరాళంగా అందచేశారు. పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి సోమవారం పుస్తకాలను విద్యాలయం ప్రిన్సిపల్ ప్రమీలారాణికి అందచేశారు. నీతి కథలు, మహనీయుల జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను అందచేసినట్టు చినరామిరెడ్డి తెలిపారు. కాగా అద్దంకి చెందిన జ్యోతి చంద్రమౌళి పాఠశాలను సందర్శించి పుస్తకాలను విరాళంగా అందించేందుకు హామీ ఇచ్చినట్టు తెలిపారు.